గంజాయి నియంత్రణకు కంకణం


గిరిజన రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం



జిల్లాలో సమూల నిర్మూలనకు యంత్రాంగం చర్యలు

- పోలీసుల ముమ్మర తనిఖీలు.. అవగాహన కార్యక్రమాలు
- గిరి రైతులకు ప్రత్యామ్నాయ పంటలతో ప్రోత్సాహం
- అన్ని శాఖల సమన్వయంతో పర్యవేక్షిస్తున్న కలెక్టర్
- జూన్ 12 నుంచి ఈ నెల 22 వరకు 62 కేసులు నమోదు
- 234 మంది అరెస్టు.. 4,386.85 కిలోల గంజాయి స్వాధీనం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

చట్ట వ్యతిరేకమైన గంజాయి సాగు, రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. వైసీపీ సర్కారు ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి గంజాయి హబ్‌గా అప్రతిష్ఠ రావడంతో తమ పాలనలో గంజాయిని సమూలంగా నిర్మూలించాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నది. ఇందులో భాగంగా ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణపై పలువురు మంత్రులతో సబ్ కమిటీ వేసిన సంగతి తెలిసిందే. దీంతో అధికార యంత్రాంగం గంజాయి నిర్మూలనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అవసరమైన చర్యలు చేపడుతున్నది.



రాజవొమ్మంగిలో ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

గంజాయికి మూలమైన గిరిజన ప్రాంతంలో పోలీసులు రెండు మార్గాల్లో గంజాయి సాగు, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం వాహనాల తనిఖీలను ముమ్మరం చేస్తూ గంజాయి తరలిస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. మరో వైపు గంజాయి వల్ల కలిగే నష్టాలపై గిరిజన రైతులు, ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో ఏజెన్సీ నుంచి గంజాయి మైదాన ప్రాంతానికి రవాణా జరగకుండా అడ్డుకట్ట వేయడంతో పాటు గంజాయి సాగు జోలికి పోకుండా ఉండాలని అవగాహన కల్పించడం ద్వారా వారిని గంజాయి సాగుకు దూరం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఫలితంగా గంజాయి సాగు, రవాణా జోలికి వెళ్లేందుకు భయపడేలా వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. పోలీస్ స్టేషన్ల స్థాయిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, రైతులతో 'పరివర్తన' పేరిట పోలీసులు సమావేశాలు నిర్వహించిన గంజాయి జోలికి వెళ్లవద్దని, ప్రత్యామ్నాయ పంట సాగు చేపట్టాలని సూచిస్తున్నారు. కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్ధార్ యంత్రాంగాన్ని నిత్యం అప్రమత్తం చేస్తూ గంజాయి నిర్మూలనకు సంబంధించి కార్యాచరణను పర్యవేక్షిస్తున్నారు.

గిరి రైతులకు 3,86,772 పండ్ల మొక్కల పంపిణీ

గిరిజన ప్రాంతంలో గంజాయి సాగుకు స్వస్తి పలికిన గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సహకరిస్తున్నారు. ఇందులో భాగంగా గంజాయి సాగుకు దూరమైన గిరిజన రైతులకు సిల్వర్ ఓక్, సీతాఫలం, జీడిమామిడి, ఆవకాడో, మెరింగా, డ్రాగన్ ఫ్రూట్, ఆరంజ్, మామిడి వంటి 3 లక్షల 86 వేల 772 పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. వాటిని నాటుకునేందుకు జాతీయ ఉపాధి హామీ పథకంలో పని దినాలు కల్పిస్తున్నారు. గిరిజన రైతులు వాటిని సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో చక్కని ఆదాయం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

భారీగా కేసుల నమోదు

గంజాయి నిర్మూలనను ప్రతిష్ఠాత్మకంగా ... మిగతా 8వ పేజీలో

మన్యాన్ని గంజాయి రహితంగా చేసేందుకు కృషి



అందరి సహకారంతో మన్యాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దుతాం. మండల, గ్రామ స్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి, వారి ద్వారా గిరిజన గ్రామాల్లో గంజాయి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు ముమ్మరం చేస్తాం. గంజాయి సాగు చేసే భూములను గుర్తించి ఆయా రైతులకు దీని వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. వారిని ప్రత్యామ్నాయ పంట సాగుకు ప్రోత్సహిస్తున్నాం. గంజాయికి బానిసలైన వారి కోసం డీఅడిక్షన్ కార్యక్రమాలు చేపడతాం. దీని కోసం అన్ని ఆస్పత్రుల్లోనూ డీఅడిక్షన్‌పై వైద్యులకు తగిన శిక్షణ అందించి, మాదక ద్రవ్యాలు వినియోగించే వారికి కౌన్సెలింగ్ ఇప్పిస్తాం. వైద్య ఆరోగ్య శాఖ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించే సమయంలో గంజాయి నిర్మూలనపై గిరిజనులను చైతన్యం చేయాలని సూచించాం.

- ఏఎస్ దినేశ్‌కుమార్, కలెక్టర్


పాడేరు పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్ధార్

28న విశాఖకు మంత్రి లోకేశ్ రాక



29న కోర్టుకు హాజరు, ముఖ్యనేతలతో భేటీ

- 30న పాఠశాలల తనిఖీ, అధికారులతో సమీక్షలు
- పార్టీ కార్యాలయంలోనే బస చేయనున్న యువనేత
- 31న ఉదయం తిరిగి విజయవాడకు పయనం


నారా లోకేశ్‌కు స్వాగత ఏర్పాట్లపై చర్చిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

విశాఖపట్నం, 25 (ఆంధ్రజ్యోతి):

ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నాలుగు రోజుల పర్యటన కోసం ఈ నెల 28వ తేదీన విశాఖకు రానున్నారు. విజయవాడలో ఆ రోజు సాయంత్రం బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన నేరుగా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వచ్చి, పార్టీ ముఖ్యనేతలతో భేటీ అవుతారు. ఆ తరువాత అక్కడే బస్సులో బస చేస్తారు. ఈ నెల 29వ తేదీ ఉదయం సీతంపేట రాజేంద్రనగర్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి అల్పాహారం తీసుకుంటారు. అక్కడి నుంచి జిల్లా కోర్టుకు వెళ్లి సాక్షి పత్రికపై దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో వాయిదాకు హాజరవుతారు. మధ్యాహ్నం పార్టీ కార్యాలయానికి చేరుకుని ముఖ్యనేతలు, పార్టీ కేడర్‌ను కలుసుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. ఈ నెల 30వ తేదీ ఉదయం పాఠశాలల పనితీరుపై విద్యాశాఖాధికారులతో సమీక్షించిన అనంతరం నగరంలోని ఒకట్రెండు పాఠశాలలను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహింస్తారు. తరువాత పార్టీ కార్యాలయానికి చేరుకుని రాత్రికి అక్కడే బసచేస్తారు. ఈ నెల 31వ తేదీ ఉదయం తిరిగి విజయవాడ బయలుదేరి వెళతారు.

ఘన స్వాగతానికి ఏర్పాట్లు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారిగా మంత్రి లోకేశ్ విశాఖ వస్తున్న నేపథ్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, నేతలు ఆళ్ల శ్రీనివాసరావు, రాజశేఖర్, వి.భరత్, బుగత సత్యనారాయణ సమావేశమై సన్నాహాలపై చర్చించారు. ఈ నెల 28న పార్టీ శ్రేణులు భారీగా ఎయిర్‌పోర్టుకు చేరుకుని లోకేశ్‌కు ఘన స్వాగతం పలకాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని నియోజకవర్గాల నుంచి జనాన్ని సమీకరించాలని ఆదేశించారు.


చెరువులవేనంలో మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

మన్యం అందాలకు ఫిదా

ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం లంబసింగి ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఉదయం ఐదు గంటల నుంచే లంబసింగి, చెరువులవేనం, తాజంగి జలాశయం వద్ద సందడి ప్రారంభమైంది. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద మంచు అందాలను వీక్షిస్తూ పర్యాటకులు ఎంజాయ్ చేశారు. సాయంత్రం వరకు లంబసింగి పరిసర ప్రాంతాలు రద్దీగా కనిపించాయి.

- చింతపల్లి

ఆర్మీ కల.. నెరవేరనున్న వేళ!

- పోర్టు స్టేడియంలో నేటి నుంచి ఆర్మీ ర్యాలీ
- వచ్చే నెల 5వ తేదీ వరకు నిర్వహణ

ఇండియన్ ఆర్మీలో చేరాలన్న వేలాది మంది కలను సాకారం చేసుకునే సమయం ఆసన్నమైంది. విశాఖలోని పోర్టు స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం తెల్లవారుజామున ప్రారంభమైంది.


- వార్త 7వ పేజీలో..


అభ్యర్థుల కాల్ లెటర్లను పరిశీలిస్తున్న ఆర్మీ సిబ్బంది

ఆశ్రమ పాఠశాలలో సమస్యలు తిష్ఠ

అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్ అందుబాటులో లేక ఇబ్బందులు

- గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో నిలిచిన పనులు
- ఆరుబయట భోజనం చేస్తున్న విద్యార్థినులు
- సరిపడా మరుగుదొడ్లు లేక అవస్థలు


ఆరుబయట భోజనం చేస్తున్న విద్యార్థినులు

అనంతగిరి, ఆగస్టు 25:

మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-2లో సమస్యలు తిష్ఠ వేశాయి. అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్ నిర్మాణం దాదాపు పూర్తయినా అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు.

గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-2లో 508 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరికి సరిపడా తరగతి గదులు లేకపోవడంతో గత వైసీపీ ప్రభుత్వం రూ.1.57 కోట్ల వ్యయంతో అదనపు తరగతి గదుల భవన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈ పనులు 90 శాతం పూర్తయినా కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. దీంతో విద్యార్థినులకు అవస్థలు తప్పడం లేదు. డైనింగ్ హాల్ అందుబాటులో లేకపోవడంతో ఆరుబయట భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే 508 మంది విద్యార్థినులకు సుమారు 40 వరకు మరుగుదొడ్లు ఉండాల్సి ఉండగా, కేవలం 18 వరకు మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు తరగతి గదుల భవనాన్ని పూర్తి చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ట్రైబల్ వెల్ఫేర్ అనంతగిరి ఏఈ గణేశ్‌ను వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు బిల్లులు అందకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయని, దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.


అందుబాటులోకి రాని అదనపు తరగతి గదుల భవనం

ఐటీడీఏ పీవోగా అభిషేక్ కొనసాగింపు

చిత్తూరు జేసీగా నియమించినా ఇక్కడ ఉండేందుకే మొగ్గు

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సిఫారసుతో రీపోస్టింగ్
- సబ్‌కలెక్టర్‌గా సౌర్యమన్ పటేల్ నియామకం


వి.అభిషేక్


సౌర్యమన్ పటేల్

పాడేరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):

బదిలీ అయిన ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌కు ఇక్కడే రీపోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో స్థానిక ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌ను చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్‌ను స్థానిక సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ, ఆయనకే ఐటీడీఏ పీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఈ నెల 17న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఇక్కడే సబ్‌కలెక్టర్‌గా, ఐటీడీఏ పీవోగా మొత్తం మూడేళ్లు పని చేసిన వి.అభిషేక్‌కు మరో ఏడాది ఇక్కడే ఐటీడీఏ పీవోగా కొనసాగాలని ఉండడంతో ఆ దిశగా ఆయన ప్రయత్నాలు చేశారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సిఫారసుతో ఆయనను మరో ఏడాది ... మిగతా 8వ పేజీలో

తాటిబందలో అతిసార

ఇంటికొకరు చొప్పున అస్వస్థత

- వైద్యం కోసం ఎదురుచూపులు


అతిసారతో బాధపడుతున్న వంతల నాగమణి

చింతపల్లి, ఆగస్టు 25:

మండలంలోని ఎ.శనివారం పంచాయతీ తాటిబంద గ్రామంలో అతిసార విజృంభించింది. గ్రామంలో ఇంటికొకరు చొప్పున వాంతులు, విరేచనాలతో బాధపడుతూ వైద్యం కోసం ఎదురుచూస్తున్నారు. వైద్య సిబ్బంది మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని వారు వేడుకుంటున్నారు.


సీందెరి సీతమ్మ

ఎ.శనివారం పంచాయతీ తాటిబంద గ్రామానికి చెందిన సుమారు ఆరుగురు విద్యార్థులు కోటవురట్ల మండలం కైలాసపట్నం ప్రైవేటు ట్రస్టు వసతి గృహంలో కలుషిత ఆహారం తీసుకుని అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులను తల్లిదండ్రులు గ్రామానికి తీసుకు రాగా, విషయం తెలిసి అధికారులు వారిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, కేజీహెచ్‌కి తరలించి మెరుగైన చికిత్స అందించారు. ప్రస్తుతం ఆ విద్యార్థులు కోలుకున్నారు. అయితే శనివారం సాయంత్రం నుంచి గ్రామానికి చెందిన కొంత మంది పురుషులు, మహిళలకు వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఇంటికి ఒకరు చొప్పున అతిసారతో బాధపడుతూ తీవ్ర నీరసంతో వైద్యం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో మర్రి బందో, సీందేరి సీతమ్మ, వంతల నాగమణి, వంతల రాజు, వంతల సలోమి, మర్రి చిన్ని, గెమ్మెలి చిన్ని, వంతల అంజలి, వంతల దాసు, మర్రి అప్పారావు, కొర్ర ఆసులు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. శనివారం నుంచి ఆదివారం రాత్రి వరకు బాధితులకు ప్రాథమిక చికిత్స అందకపోవడతో వారు నడవలేని స్థితికి చేరుకున్నారు. గ్రామంలో అతిసార అధికంగా ఉన్నదని, వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కి ఫోన్ ద్వారా సమాచారం పంపించామని, ఇప్పటి వరకు వైద్య సిబ్బంది ఎవరూ గ్రామానికి రాలేదని స్థానిక యువకుడు మర్రి లక్ష్మణ తెలిపారు.


వంతల బందో

క్రైం... crime news

ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ

» యువకుడి దుర్మరణం.. ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

పద్మనాభం, ఆగస్టు 25: మండలంలోని చిన్నాపురం వద్ద శనివారం రాత్రిఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందగా, ఇద్దరు గాయపడ్డారు. పోలీసులందించిన వివరాలివి. ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన కనకల శ్రీనివాసరావు (36) విజయనగరంలో కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని శనివారం రాత్రి 9.45గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామం వస్తున్నారు. అదే సమయంలో అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఆర్‌వీ అగ్రహారం గ్రామానికి చెందిన లెక్కల సతీశ్, శ్రీదేవిక విజయనగరం వెళ్తున్నారు. సతీశ్ చిన్నాపురం జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్ల వద్ద వేగాన్ని అదుపు చేయలేక ఎదురుగా వస్తున్న శ్రీనివాసరావు బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో రెండు బైక్‌లపైన ఉన్న ముగ్గురు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌లు నుజ్జయ్యాయి. అదే సమయంలో గస్తీలో ఉన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 108 వాహనంలో క్షతగాత్రులను విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించగా సతీశ్, శ్రీదేవికకు చికిత్స అందించారు. వీరిలో సతీశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు. దీనిపై సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సురేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్ మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.



శ్రీనివాసరావు (ఫైల్)

28న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 28న నిర్వహించాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి నిర్ణయించారు. స్టాండింగ్ కమిటీకి ఈనెల ఏడున ఎన్నిక నిర్వహించగా, పది స్థానాలనూ కూటమి అభ్యర్థులే గెలుచుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో ఇప్పటివరకు సమావేశం నిర్వహించలేదు. నూతన సభ్యులతో తొలి సమావేశం కావడంతో కమిషనర్ హాజరుకానున్నారు. ఇందుకోసం 300కిపైగా అంశాలతో ఎజెండా సిద్ధం చేశారు. వీటిలో 130కిపైగా అంశాలు మెకానికల్ విభాగానికి సంబంధించినవేనని తెలిసింది.

నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా కల్పశ్రీ

నర్సీపట్నం, ఆగస్టు 25 : నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా కేఆర్ కల్పశ్రీని నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఆర్డీవోగా పని చేస్తున్న హెచ్‌వీ జయరాం స్థానంలో 2022 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కల్పశ్రీ బాధ్యలు స్వీకరించనున్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 25: జాతీయ సీనియర్ పురుషుల మహిళల ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ టోర్నీలో ఆంధ్ర లిఫ్టర్లు ఓ వరాల్ చాంప్ తృతీయ స్థానంలో ట్రోఫీని దక్కించుకున్నారు. కోల్‌కతాలో జరిగిన ఈ టోర్నీ పురుషుల డెడ్ లిఫ్ట్ ఈవెంట్ 59 కిలోల విభాగంలో డి. మురళీకృష్ణ (262.5 కిలోలు),66 కిలోల విభాగంలో ఎస్.శరత్ (286 కిలోలు) ఎత్తి సరికొత్త జాతీయ రికార్డులు నెలకొల్పారు. ఇక ఓవరాల్ ఈ వెంట్‌లో డి.మురళీకృష్ణ కాంస్య పతకం, 120 ప్లస్ కిలోల కేటగిరిలో షేక్ షాకిబ్ బాషా రజతం, మహిళల 76 ప్లస్ కిలోల విభాగంలో బి.చంద్రిక కాంస్యం సాధించారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను ఏపీ పవర్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు గంట్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్య దర్శి ఎస్.సూర్యనారాయణ, సౌత్‌జోన్ కార్యనిర్వాహక కార్యదర్శి, ఆంధ్ర చీఫ్ కోచ్ సకల కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు మద్ది ప్రభాకర్ తదితరులు అభినందించారు.

ఆర్మీ కల.. నెరవేరనున్న వేళ!

- పోర్టు స్టేడియంలో నేటి నుంచి ఆర్మీ ర్యాలీ
- వచ్చే నెల 5వ తేదీ వరకు నిర్వహణ
- రోజుకు 500 నుంచి 800 మందికి పరీక్ష
- అభ్యర్థులకు ఇప్పటికే అడ్మిట్ కార్డులు జారీ
- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు



ఆదివారం రాత్రి పోర్టు స్టేడియం బయట నిద్రిస్తున్న అభ్యర్థులు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):
ఇండియన్ ఆర్మీలో చేరాలన్న వేలాది మంది కలను సాకా రం చేసుకునే సమయం ఆసన్నమైంది. నగర పరిధిలోని పోర్టు స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం తెల్లవారుజామున ప్రారంభమయింది. ఈ నెల 26 అర్ధరాత్రి 12.30 గంటల నుంచి వచ్చే నెల ఐదో తేదీ వరకు జరగ నున్న ర్యాలీలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి కృష్ణా జిల్లా వరకు చెందిన అభ్యర్థులు పాల్గొననున్నారు. ప్రతిరోజూ 500 నుంచి 800 మంది ర్యాలీలో పాల్గొంటారని అధికారులు అం చనా వేసి, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తిచేశారు. అభ్యర్థులకు ఇప్పటికే అడ్మిట్ కార్డులను జారీచేశారు. తమకు కేటాయించిన సమాయానికి మైదానానికి చేరుకుని రిపోర్టు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఒక్క నిమిషం ఆల స్యమైనా లోపలకి అనుమతించరన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్‌మన్ పోస్టులను భర్తీ చేసేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మి ట్ కార్డు, ఒరిజినల్ ఆధార్, రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువ పత్రం, పదో తరగతి మార్కులు లిస్టు, లేదా స్టడీ సర్టిఫికెట్, లేదా టీసీ గానీ తీసుకు రావాల్సి ఉంటుంది. 1600 మీటర్ల రన్నింగ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫి కేషన్, అనంతరం మెడికల్ టెస్ట్‌లు ఉంటాయి. ఇదిలా ఉండగా ర్యాలీ జరగనున్న డైమండ్ జూబ్లీ మైదానంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ట్రాక్ పునరుద్ధరణ, బారికేడింగ్, లైట్లు, టెంట్లు, క్యూలైన్లను నిర్మించారు. ఈ మేరకు సైన్ బోర్డులను మైదానం అంతటా ఏర్పాటు చేశారు. ర్యాలీని విజయవంతంగా పూర్తిచేసేందుకు జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, ఈపీడీసీఎల్, స్పోర్ట్స్, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సహకరిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

పాకలో పాఠశాల

శీతకండిలో దారుణ పరిస్థితి

» గ్రామస్థుల చొరవతో ప్రైవేటు స్థలంలో నిర్వహణ

» నాలుగేళ్లుగా పునాది దశ దాటని భవన నిర్మాణం



సీతకండిలో ప్రైవేటు తాటాకు పాకలో నిర్వహిస్తున్న పాఠశాల

గొలుగొండ, ఆగస్టు 25: మండలంలోని శీతకండి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పదేళ్లుగా పరాయి పంచన నిర్వహిస్తున్నారు. దీనిపై స్థానిక విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గొలుగొండ మండలంలోని ఏటిగైరంపేట గ్రామపంచాయతీలోని సీతకండి గ్రామంలో ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకూ 21 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం శిథిల స్థితికి చేరడంతో ఉన్న ప్రైవేటు భవనంలో పాఠశాల నిర్వహణకు గ్రామస్థులు, విద్యాశాఖ సిబ్బంది చర్యలు తీసుకొంది. అయితే భవనం ఖాళీ చేయాలని యజమాని విద్యాశాఖను కోరారు. దీంతో పాఠశాల తరగతుల భవనం నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామంలో ఒక కుటుంబానికి చెందిన ఇంటి పైకప్పు శాబ్ వేయని ఒక ఇంటిపై తాటాకులు ఏర్పాటు చేసుకుని తరగతులు నిర్వహించాలని గ్రామస్థులు నిర్ణయించారు. ఆ తాటాకుపాకలో కనీసం వెలుతురు, గాలి పరిస్థితి ఉంది. అంతేకాకుండా పాకలో తరగతులు నిర్వహిస్తుండడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పాక కావడంతో విష పురుగుల నుంచి ప్రమాదం ఏర్పడవచ్చని అంటున్నారు.



తరగతులు నిర్వహిస్తున్న గాలి, వెలుతురు లేని ఇరుకుగది

2021-22లో నాడు-నేడు పనుల్లో రెండవ విడతలో రెండు గదుల భవనం నిర్మాణానికి అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ. 25 లక్షలు మంజూరు చేసింది. అనంతరం తొలుతగా ఇక్కడ శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం తొలగించారు. భవన నిర్మాణం 2021లో ప్రారంభించారు. కొంత వరకు పనులు పూర్తి కాగా, రూ.ఐదు లక్షల బిల్లులు మంజూరు చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి పాఠశాల తరగతి భవన నిర్మాణం నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతూ పునాది స్థాయిలోనే ఉండిపోయింది. అప్పటి నుంచి పరాయి పంచనే చదువులు సాగుతున్నాయి. కనీసం కూటమి ప్రభుత్వ హయాంలోలైనా పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.



నాలుగేళ్లుగా పునాది దశలోనే ఉన్న పాఠశాల భవన నిర్మాణం

యాజమాన్య నిర్లక్ష్యం వల్లే 'ఎసెన్షియా'లో ప్రమాదం

» వెంటనే అరెస్టు చేయాలి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



మూలజంపలో మాట్లాడుతున్న నర్సింగరావు

రాంబిల్లి, ఆగస్టు 25: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని మూలజంప గ్రామానికిచెందిన వేగి సన్యాసినాయుడు కుటుంబాన్ని ఆదివారం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. సెజ్ ఏర్పడిన తరువాత ఇదే పెద్ద ప్రమాదమన్నారు. ఈ ఘటనలో 17 మంది మృతి చెందారని, సుమారు 24 మంది వరకు గాయాలకు గురయ్యారన్నారు. ఇంత ఘోరానికి కంపెనీ యాజమన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. సేఫ్టీ ఆడిట్ నిర్వహించకపోవడం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, కార్మిక శాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం కార్మిక శాఖ అధికారులతో పాటు, భద్రతా ప్రమాణాలు పాటించని కంపెనీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎసెన్షియా కంపెనీ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడు నాయుడు, ఆర్. రాము, ఎస్‌ఈజెడ్ నిర్వాసితుల సంఘం నాయకులు బుద్దా రంగారావు, ఆర్. రాంబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపాలి

అచ్యుతాపురం రూరల్ : ఇక్కడి సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కర్మాగారంలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, సదరు యాజమన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. ఆదివారం అచ్యుతాపురంలోని ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎసెన్షియలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారన్నారు. అలాగే, పరవాడ ఫార్మా సిటీలోని సినర్జిన్ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఇలా ఫార్మా కంపెనీల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా యాజమాన్యాలు స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సేఫ్టీకి ప్రాధాన్యం ఇవ్వకుండా లాభాల కోసం చూస్తుండడం వల్లే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇటువంటి కర్మాగారాలపై కేంద్ర, రాష్ట్ర ప్రత్యేక దృష్టిసారించాలని ఆయన కోరారు. యూనియన్ నాయకులు జి.కోటేశ్వరరావు, రొంగలి రాము, జి.దేముడునాయుడు, కూండ్రపు సోమునాయుడు, కర్రి అప్పారావు, బుద్దా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేశాకే కారిడార్ పనులు చేపట్టాలి

» నిర్వాసిత రైతుల సమావేశంలో పలు పార్టీల నాయకుల డిమాండ్



నిర్వాసిత రైతులకు సంఘీభావం తెలుపుతున్న పార్టీల నాయకులు

నక్కపల్లి, ఆగస్టు 25: విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నక్కపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో రైతుల నుంచి సేకరించిన భూములకు సంబంధించి పూర్తి స్థాయిలో పరిహారం, ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చిన తరువాత ఏ పనులైనా చేపట్టాలని పలు పార్టీల నాయకులు స్పష్టం చేశారు. లేనిపక్షంలో నిర్వాసితులతో కలిసి ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆదివారం మూలపర్ర గ్రామంలో మండలంలోని కారిడార్ నిర్వాసిత రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, అమలాపురం ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, రైతు సంఘం నాయకులు గొర్ల బాబూరావు, సూరకాసుల గోవింద్, తళ్లా భార్గవ్, గంటా తిరుపతిరావు, యలమంచిలి తాతబాబు తదితరులు కారిడార్ నిర్వాసిత రైతులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారిడార్ పరిధిలో నివాసాలు కోల్పోయేవారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, ఒక్కొక్కరికి రూ.25 లక్షలు పరిహారం, పది సెంట్లు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతవరకూ ఎటువంటి పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు తళ్లా అప్పలస్వామి, సూరిబాబు, రావి ఈశ్వరరావు, అప్పారావు, ఎరుపిల్లి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభం వద్ద ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్

సింహాచలం, ఆగస్టు 25: వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం అనంతపురం జిల్లాకు చెందిన శాసనసభ్యులు ఎ. సురేంద్రబాబు, ఇంటలిజెన్స్ బ్యూరో (సెంట్రల్) ప్రత్యేక డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్ (ఐపీఎస్), జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు పీవీ నరసింహం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి నక్క ఆనందకుమార్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండప ప్రదక్షిణ చేసి అంతరాలయంలోకి వెళ్లిన ప్రముఖుల గోత్రనామాలతో అర్చకులు స్వామివారికి అష్టోత్తర శతనామార్చన జరిపారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజల తరువాత పండితులు వేదాశీర్వచనాలిచ్చారు. ప్రహ్లాదవరదుడైన సింహాచల వరాహలక్ష్మీనారసింహునికి వైభవంగా పసిడి కుసుమార్చన నిర్వహించారు. ఇందులోభాగంగా ఆదివారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవి సమేతం శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు.

అనంతపద్మనాభునికి లక్ష తులసీ పూజ



పద్మనాభం, ఆగస్టు 25: పద్మనాభంలోని అనంతపద్మనాభుని క్షేత్రంలో లక్ష తులసి దళ పూజా కార్యక్రమం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఏటా శ్రావణ మాసంలో నిర్వహించే ఈఉత్సవంలో భాగంగా ముందుగా అనంతుని ఉత్సవ విగ్రహాలు, కుంతీమాధవస్వామి మూలవిరాట్టులకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవానికి అవసరమైన తులసి దళాలను వేదమంత్రోచ్చరణలతో ఆలయ ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేసి ఆలయంలోకి తీసుకువెళ్లారు. వేదపండితుల సహస్ర నామస్మరణతో స్వామివారిని లక్షతులసి దళార్చనను వైభవంగా పూర్తి చేశారు. అనంతరం లక్ష్మీదేవికి కుంకుమార్చన చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు

» ప్రమాదాలకు గురవుతున్న పరవాడ గ్రామస్థులు

» అధికారులు వెంటనే స్పందించాలని వేడుకోలు



పరవాడ ప్రధాన రహదారి గుండా వెళ్తున్న భారీ వాహనం

పరవాడ, ఆగస్టు 25: మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారి గుండా ఇటీవల కాలంలో భారీ వాహనాల రాకపోకలు అధికమైంది. ఈ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునగపాక మండలంలోని వెంకటాపురానికి సమీపంలో గల ఆర్‌హెచ్‌ఐ క్లాసిల్ కంపెనీకి కావాల్సిన ముడిసరకులు తరలించే భారీ వాహనాలన్నీ పరవాడ గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీనివల్ల తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. రహదారికి ఆనుకుని నివాసాలు ఉండడంతో పాటు వృద్ధులు, చిన్నపిల్లలు రహదారి దాటేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. కేవలం భారీ వాహనాల రాకపోకలు కారణంగానే తరుచూ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. భారీ వాహనాలకు అనుమతులు లేనప్పటికీ నిబంధనలను అతిక్రమించి ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి పరవాడ ప్రధాన రహదారి గుండా భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేనిపక్షంలో వాహనాలు రాకుండా తాము అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే సంబంధిత కంపెనీ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చూడముచ్చటగా చిన్నికృష్ణుడు

» అంకుడు కర్రతో అద్భుతంగా చెక్కిన ఏటికొప్పాక మహిళ





అంకుడు కర్రతో లావణ్య చెక్కిన చిన్నికృష్ణుని బొమ్మ

ఎలమంచిలి, ఆగస్టు 25:
హస్త కళా రంగంలో జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన ఎలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన హస్తకళాకారిణి చింతల లావణ్య అంకుడు కర్రతో సూక్ష్మ కళాఖండాన్ని రూపొందించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని అంకుడు కర్రతో రెండు రోజుల పాటు శ్రమించి 3.5 సెం.మీ ఎత్తు, 2 సెం.మీ వెడల్పులో చిన్న బొమ్మను అత్యద్భుతంగా చెక్కారు. దీనిని చూసినవారంతా ఆమెలోని కళా నైపుణ్యాన్ని ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

డ్వాక్రా మహిళలకు అవార్డు



అవార్డు పొందిన రేవతిని సత్కరిస్తున్న డ్వాక్రా సంఘం ప్రతినిధులు

ఎలమంచిలి, ఆగస్టు 25: లక్ పతి దీదీ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమాన్ని డ్వాక్రా సంఘాల మహిళలు పెద్ద ఎత్తున వీక్షించారు. మండల మహిళా సమాఖ్య అధికారుల ఆధ్వర్యంలో ఏటికొప్పాకలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకుల రుణాలను సద్వినియోగం చేసుకున్న ఇక్కడి శ్రీసూర్య గ్రామ సంఘంలోని వానపల్లి రేవతి, గొంతుమూర్తి సత్యవతిలు లక్ పతి దీదీలో అవార్డుకు ఎంపికైనట్టు మండల సమాఖ్య ప్రతినిధి రాణి తెలిపారు. ఏటికొప్పాక-5 మోడల్ వీవోగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇక్కడున్న 30 సంఘాలు అన్ని రకాలైన ప్రభుత్వ పథకాలు పొంది వాటి లక్ష్యాలకు అనుగుణంగా జీవనోపాధి పొందుతున్నారన్నారు. అనంతరం అవార్డుకు ఎంపికైన వారిని గ్రామమైక్య సంఘం ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రతినిధి రాణి, సీసీలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో శానిటేషన్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

» సంఘం జిల్లా కమిటీ సమావేశంలో కార్యదర్శి జానకి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జానకి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని స్కూల్ శానిటేషన్ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి జానకి కోరారు. ఆదివారం ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో ఆయా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇచ్చేదే అరకొరని, అదికూడా సకాలంలో చెల్లించకపోతే కుటుంబాలను ఎలా నెట్టుకు వస్తారని ప్రశ్నించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ హైస్కూళ్లలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు అధిక పని ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎక్కువ ఉన్నా తక్కువ మంది సిబ్బందితో పనిచేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో కార్మికులకు సెలవులు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వీరి సమస్యలపై తక్షణమే స్పందించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు వరలక్ష్మి, నీలవేణి, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆగాకర పంటపై రైతుల ఆసక్తి



చినరాచపల్లిలో ఆగాకర కూరగాయల సాగు

మాకవరపాలెం, ఆగస్టు 25: మండలంలోని చినరాచపల్లి గ్రామ రైతులు ఆగాకర కూరగాయల పంటలపై ఆసక్తి చూపుతున్నారు. గ్రామానికి చెందిన భూములు అల్యూమినియం కర్మాగారం భూసేకరణలో పోయినప్పటికీ మిగిలిన భూముల్లో మాత్రం రైతులు కూరగాయల పంటలు వేసి సాగు చేస్తున్నారు. సుమారు 20 ఎకరాల్లో రైతులు ఆగాకర కూరగాయల సాగు చేపట్టారు. అయితే ఆగాకర కిలో రూ.120 ధర ఉండటంతో లాభదాయకంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సాగును చేపట్టి సోలార్ మోటార్ల ద్వారా నీటి తడులు అందించి లాభాల పంటగా సాగు చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ సాగు మరింత పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు.

బాబోయ్ దొంగలు..

▸ ముంచంగిపుట్టులో వరుస దొంగతనాలు
▸ రెచ్చిపోతున్న ద్విచక్ర వాహన దొంగలు
▸ భయాందోళనలో ప్రజలు, వాహన చోదకులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 25: మండలంలో దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనాలు వరుసగా చోరీకి గురవుతున్నాయి. అలాగే ఇళ్లల్లో చొరబడి దొరికినకాడికి బంగారం, వెండి, ఇతర ఆభరణాలను దొంగలు ఎత్తుకుపోతున్నారు. దీంతో మండల వాసులు భయాందోళన చెందుతున్నారు.

మండలంలో నాలుగేళ్ల క్రితం మొత్తం సుమారు 12 ద్విచక్ర వాహనాలు చోరీకి గురైన విషయం తెలిసిందే. అప్పటి ఎస్ఐ సంతోష్ చాకచక్యంగా అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగలను పట్టుకొని కటకటాల వెనక్కి నెట్టారు. అనంతరం గత నాలుగేళ్లగా స్తబ్దుగా ఉన్న ద్విచక్ర వాహన దొంగలు కొద్ది రోజులుగా రెచ్చిపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో మండలంలో మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి.

గ్రామ సభలను ముగించుకొని స్వగ్రామానికి వెళ్తున్న సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రెయ్యల పురుషోత్తంను బరడ, లబ్బూరు గ్రామాల మధ్యలో దొంగలు గన్‌తో బెదిరించి ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకుపోయిన విషయం తెలిసిందే. అలాగే ఇటీవల మండల కేంద్రంలో ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని రాత్రి సమయంలో దొంగలు ఎత్తుకుపోయారు. ఇదే తరహాలో గత నెల రోజులు క్రితం మండల కేంద్రంలో ఒక ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. రేయింబవళ్లు తేడా లేకుండా వాహనాలు చోరీకి గురికావడంతో మండల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నాలుగు నెలల క్రితం మండల పరిధిలోని దారి దోపిడీలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనంపై ఎక్కడికి వెళ్లాలన్నా భయమేస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతానికి మండలం ఆనుకొని ఉండడంతో అంతర్రాష్ట్ర దొంగలు ఆంధ్రా భూ భాగంలో దొంగతనం చేసి సులువుగా ఒడిశా భూ భాగంలోకి వెళ్లిపోతున్నారని విశ్వశనీయ సమాచారం.

దొంగల చేతిలో తుపాకులు

మండల పరిధిలో చోరీలకు పాల్పడుతున్న దొంగల చేతిలో తుపాకులు ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గతంలో మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రంలో ఒక ఇంటిలోకి చొరబడిన దొంగలు తుపాకులతో బెదిరించి డబ్బులు, బంగారం ఎత్తుకుపోయారని బాధితులు తెలియజేసిన విషయం తెలిసిందే. ఆ సంఘటన మరవక ముందే గత శుక్రవారం బరడ, లబ్బూరు సమీపంలో తుపాకీతో బెదిరించి ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకుపోయినట్టు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



చోరీకి గురైన ద్విచక్ర వాహనం ఇదే... మాకవరంలో చోరీ జరిగిన ఇల్లు (ఫైల్)

అలాగే గతంలో పలు దారి దోపిడీలకు సైతం దొంగలు పాల్పడిన విషయం తెలిసిందే. దొంగల చేతిలో తుపాకులు ఉండడం వలన ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గతంలో వరుస దొంగతనాలు జరగడంతో గ్రామాల్లో యువకులు స్వచ్ఛందగా రాత్రి వేళల్లో పహారా కాసిన సంఘటనలు ఉన్నాయి. మరిన్ని దొంగతనాలు జరగకుండా పోలీసులు ప్రత్యేక దృష్టిసారించాలని మండల ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.



ముంచంగిపుట్టులో రాత్రి వేళ పహారా కాస్తున్న యువకులు (ఫైల్ ఫొటో)

వాహనాల వివరాలను నమోదు చేయాలి

ఒడిశా సరిహద్దు ప్రాంతానికి ఆనుకుని మండలం కావడంతో ఇరు రాష్ట్రాలకు చెందిన వాహనాలు మండల కేంద్రం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. స్థానిక నాలుగు రోడ్ల కూడలితో పాటు పలుచోట్ల నిత్యం పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుంటారు. అయితే వాహన రికార్డులను, లైసెన్స్‌లను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నప్పటికీ, వాహనాల నంబర్లను, అనుమానితుల వివరాలను ఆశించిన స్థాయిలో రికార్డు చేయడం లేదని సమాచారం. తనిఖీలు చేసే సమయంలో వాహనాల వివరాలను నమోదు చేస్తే చోరీలు జరిగే సమయంలో దొంగలను పట్టుకొనేందుకు కాస్త ఉపయోగపడే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఇతర ప్రాంతాల నుంచి మండల కేంద్రం మీదుగా కొత్త వ్యక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ తరుణంలో వారి వివరాలను పోలీసులు పక్కాగా నమోదు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే రాత్రి వేళల్లో 11 గంటలు దాటిన తరువాత పని లేకుండా అనవసరంగా బయట సంచరించే వారిపై పోలీసులు ఓ కన్నేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం: ఎస్ఐ రవీంద్ర

మండలంలో దొంగతనాలు జరగకుండా తగిన చర్యలు చేపడుతున్నామని, దొంగలను పట్టుకొనేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్ఐ కె.రవీంద్ర తెలిపారు. గ్రామ శివారున ఉండే వారంతా తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి 11 గంటలు దాటిన తరువాత అనవసరంగా బయట సంచరించరాదని చెప్పారు. ఇప్పటికే కొంత దొంగల సమాచారం సేకరించామని, ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

అన్ని యాజమాన్య పాఠశాలల్లో స్వీయ మదింపు నమూనా పరీక్షలు

▸ జిల్లా విద్యా శాఖాధికారి బ్రహ్మాజీరావు



పాడేరు రూరల్, ఆగస్టు 25: అల్లూరి జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 27వ తేదీ నుంచి స్వీయ మదింపు నమూనా పరీక్షలు జరిగే విధంగా చర్యలు చేపట్టామని జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీ రావు తెలిపారు. 1 నుంచి 8 తరగతుల విద్యార్థులు ఓఎంఆర్‌పై రాయాలని, 9, 10 తరగతుల విద్యార్థులకు పాత విధానంగా పరీక్షలు నిర్వహించాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఆదేశించామన్నారు. ఈ పరీక్షలు ఎస్సీఈఆర్టీ రూపొందించిన ప్రశ్నాపత్రాలపైనే జరుగుతాయని చెప్పారు. ఈ ప్రశ్నాపత్రాలు మండల కేంద్రం నుంచి ఎంఈవోల పర్యవేక్షణలో పరీక్షకు గంట ముందు పాఠశాలల హెచ్ఎంలకు పంపిణీ చేస్తారన్నారు. టైంటేబుల్ ప్రకారం హెచ్ఎంలు ఈ పరీక్షలను 27వ తేదీన ఓఎస్ఎస్‌సీ పరీక్ష, 28న తెలుగు, 30న ఆంగ్లం, 31న గణితం, సెప్టెంబరు 2న ఎన్విరాన్‌మెంట్ సైన్స్, 3వ తేదీన జనరల్ సైన్స్, 4వ తేదీన సాంఘిక శాస్త్రం పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇప్పటికే పరీక్ష పత్రాలు మండల కేంద్రాలకు తరలించామన్నారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు త్రీమెన్ కమిటీలు నియమించామన్నారు. ఈ కమిటీలో సీనియర్ హెచ్ఎంలు, ఎంఈవో-1, ఎంఈవో-2లు ఉంటారన్నారు. మండల కస్టోడియన్‌గా హెచ్ఎంలు విధులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

ఆరుగురు విద్యార్థులు డిశ్చార్జి

▸ ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం

పాడేరు రూరల్, ఆగస్టు 25: కైలాసపట్నం అనాథ ఆశ్రమంలో ఆహారం విషతుల్యంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన విద్యార్థుల్లో ఆరుగుర్ని వైద్యులు డిశ్చార్జి చేశారు. విశాఖ కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతున్న ఆరుగురు విద్యార్థులను అక్కడ వైద్యులు శనివారం పాడేరు డీజీహెచ్‌కు తరలించారు. వారి ఆరోగ్యం పూర్తిగా కుదుట పడడంతో డిశ్చార్జి చేయవచ్చని స్థానిక వైద్యులు స్పష్టం చేయడంతో జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదివారం ఆస్పత్రికి చేరుకొని డిశ్చార్జైన విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులను ప్రభుత్వ వసతి వసతి గృహాల్లోనే చేర్పించాలని, అనుమతి లేని అనధికార వసతిగృహాల్లో చేర్పించవద్దని కుటుంబ సభ్యులకు సూచించారు.

అలాగే డిశ్చార్జైన విద్యార్థులు కిల్లో జ్యోతి, మర్రి మీనాక్షి, మర్రి కుమారి, బురడ అబ్రహం, పాంగి మౌనిక, పాంగి మీరాలను సమీపంలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించాలని టీడబ్ల్యూ డీడీ కొండలరావుకు పీవో అభిషేక్ ఆదేశించారు. అలాగే వారి స్వగ్రామాలకు అంబులెన్స్‌లో తరలించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు రూ.50 వేల చెక్కుతో పాటు 25 కిలోల బియ్యం, పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. మెడికవర్‌లో చికిత్స పొందుతున్న మరో ముగ్గురు విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడడంతో ఆదివారం పాడేరు జీజీహెచ్‌కు తీసుకు వచ్చారు. వారి ఆరోగ్యం కుదుటపడి కోలుకుంటే సోమవారం డిశ్చార్జి చేస్తామని జేసీ అభిషేక్ గౌడ్ తెలిపారు.



డిశ్చార్జి విద్యార్థుల కుటుంబ సభ్యులతో జేసీ, ఐటీడీఏ పీవో, వైద్యులు

వైద్య విద్యార్థి హత్యాచార నిందితులను శిక్షించాలి

పాడేరు రూరల్, ఆగస్టు 25: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రం పాడేరులో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని స్థాయిల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలని, ఘటనలో నిందితులతో పాటు వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న వారిని శిక్షించాలని కోరారు. నిందితులను రక్షించేందుకు బెంగాల్ ప్రభుత్వం ప్రయత్నించడం అన్యాయమన్నారు. సుప్రీం కోర్టు ఎన్ని చట్టాలు చేసినా అమలు చేసే రాజకీయ నాయకుల మెదళ్లో విష పూరిత ఆలోచనలు ఉన్నప్పుడు ఇటువంటి ఘటనలు నిత్యకృత్యంగా మారతాయన్నారు. అత్యాచార రహిత భారతదేశాన్ని సాధించాలంటే పురుషాధిక్య మతోన్మాద భావజాలాలపై నిత్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే సంపూర్ణ మద్య నిషేధం, గంజాయి, మాదకద్రవ్యాలు అరికట్టాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీహెచ్‌డబ్ల్యూల సంఘం జిల్లా నాయకులు దాసమ్మ, వరలక్ష్మి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, మహిళలు

చాపరాయిలో పర్యాటకుల సందడి



చాపరాయిలో సందడి చేస్తున్న పర్యాటకులు

డుంబ్రిగుడ, ఆగస్టు 25: మండల కేంద్రంలోని చాపరాయి జలవిహారిలో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు జల విహారిని తిలకించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సమేతంగా జల విహారిలోని పచ్చని అందాలను తిలకిస్తూ, ఉత్సాహంగా థింసా నృత్యాలు చేశారు. అందాల గార్డెన్‌లో కుటుంబ సమేతంగా ఆనందంగా గడిపారు.

బొర్రా కళకళ..



బొర్రా గుహలను తిలకిస్తున్న పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రాగుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పర్యాటకులు రాకతో గుహలు ప్రాంగణం సందడిగా మారింది. 2400 మంది పర్యాటకులు గుహలను తిలకించగా, రూ.2.64 లక్షల ఆదాయం సమకూరిందని యూనిట్ మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు..

టీడబ్ల్యూ హెచ్ఎంల సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవం

▸ అధ్యక్ష, కార్యదర్శులుగా జీవీవీ ప్రసాద్, టి.నాగేశ్వరరావు ఎన్నిక



జీవీవీ.ప్రసాద్... టి.నాగేశ్వరరావు

పాడేరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ విద్యాశాఖ ప్రధానోపాధ్యాయుల సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనకాపల్లి జిల్లా సంఘ నేత బావరాజు అప్పారావు, విజయనగరం జిల్లా సంఘం నేత కర్రి సూర్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా ఎస్.హర్షచంద్రరావు, అధ్యక్షుడిగా జీవీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా టి.నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.రామరాజుపడాల్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.ప్రసాదరావు, మహిళా అధ్యక్షురాలిగా కె.సుమిత్ర, కోశాధికారులుగా పి.పండన్న, ఎం.బాలరాజు, మరికొంత మంది ప్రధానోపాధ్యాయులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. గిరిజన విద్యాభివృద్ధికి, ప్రధానోపాధ్యాయుల సంక్షేమానికి తాము కృషి చేస్తామని నూతన కమిటీ ఈ సందర్భంగా పేర్కొంది.

ఆరు పాఠశాలల మంజూరు

▸ ఎంఈవో-1, 2 కృష్ణమూర్తి, పుష్పజోషఫ్... 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

పెదబయలు, ఆగస్టు 25: మండలంలో 11 గ్రామాలకు పాఠశాలలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, మొదటి విడతగా ఆరు గ్రామాల్లో ఎన్ఆర్ఎస్‌టీసీ (నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్)లను మంజూరు చేసిందని ఎంఈవో-1, 2 కృష్ణమూర్తి, పుష్పజోషఫ్ తెలిపారు. 'అయ్యా చదువుకుంటాం... మాకు బడి పెట్టండి' అనే శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. అలాగే ఇంజరి పంచాయతీ ననుబరి గ్రామంలో 50 మంది విద్యార్థులు విద్యకు దూరంగా ఉన్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి గ్రామంలో పాఠశాల మంజూరు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. దీంతో పెదబయలు మండల విద్యా శాఖ అధికారులు కొమ్ము క్రిష్ణమూర్తి, పుష్పజోషెప్ మాట్లాడుతూ ననుబరి, చీపురుగొంది, కిలుములు, కుంటమామిడి, లింగేరిపుట్టు, సుజ్జరి గ్రామాల్లో త్వరలో తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

ఐటీడీఏ పీవోగా అభిషేక్ కొనసాగింపు

... 5వ పేజీ తరువాయి

ఇక్కడే ఐటీడీఏ పీవోగా కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో చిత్తూరు జేసీగా జారీ చేసిన నియామకాన్ని రద్దు చేస్తూ ఆయననే ఐటీడీఏ పీవోగా కొనసాగిస్తూ ఆదివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతి లభించినా ఆయన ఇక్కడే ఐటీడీఏ పీవోగా కొనసాగేందుకు మొగ్గు చూపడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సబ్‌కలెక్టర్‌గా, ఐటీడీఏ పీవోగా ఆయన గిరిజనులకు ప్రత్యేకంగా(ఆయన మార్క్) సేవలందించిన దాఖలాలు లేవు. అయినప్పటికీ ఆయన ఇక్కడే ఉండేందుకు ఆసక్తి కనబరచడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

సబ్ కలెక్టర్‌గా సౌర్యమన్ పటేల్ నియామకం

2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సౌర్యమన్ పటేల్ శిక్షణ పూర్తికావడంతో స్థానిక సబ్‌కలెక్టర్‌గా నియమించారు. వాస్తవానికి తెనాలి సబ్‌కలెక్టర్‌గా పని చేస్తున్న ప్రఖార్‌జైన్‌ను స్థానిక సబ్‌కలెక్టర్‌గా నియమిస్తూ ఈనెల 17న ఉత్తర్వులు జారీ చేశారు. కానీ తాజా ఉత్తర్వుల్లో ప్రఖార్‌జైన్‌ను బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా నియమించారు.

గంజాయి నియంత్రణకు కంకణం

... 5వ పేజీ తరువాయి

తీసుకున్న కూటమి ప్రభుత్వం. అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించింది. రంగంలోకి దిగిన పోలీసు అధికారులు ఈ ఏడాది జూన్ 12 నుంచి ఆగస్టు 22 వరకు జిల్లా వ్యాప్తంగా 62 కేసులు నమోదు చేసి 4,386.85 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 234 మందిని అరెస్టు చేశారు. అలాగే గంజాయికి సంబంధించి పాడేరు స్టేషన్‌లో 6 కేసులు, హుకుంపేటలో 1, అరకులోయలో 1, అనంతగిరిలో 5, డుంబ్రిగుడలో 1, జి.మాడుగులలో 5, ముంచంగిపుట్టులో 2, పెదబయలులో 4, చింతపల్లిలో 6, అన్నవరంలో 5, జీకేవీధిలో 5, సీలేరులో 1, కొయ్యూరులో 3, మారేడుమిల్లిలో 3, చింతూరులో 6, మోతుగూడెంలో 6, డొంకరాయిలో 2 కేసులను పోలీసులు నమోదు చేశారు.

గంజాయి సమూల నిర్మూలనకు చర్యలు



ఏజెన్సీలో గంజాయిని సమూలంగా నిర్మూలించడానికి పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. గంజాయి సాగు చేపట్టే వ్యక్తులు, దానిని రవాణా చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం. ప్రధానంగా ఏజెన్సీలో అనంతగిరి, అరకులోయ, జీకే వీధి, జి.మాడుగుల, ముంచంగిపుట్టు, పెదబయలు, చింతపల్లి మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గంజాయి రవాణాను అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు చేపట్టడంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. గంజాయి శాశ్వత నిర్మూలనకు ప్రజలు కూడా సహకరించాలి.

-అమిత్ బర్దార్, జిల్లా ఎస్పీ



ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆటలు ఆడుతున్న ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం

పాడేరు రూరల్, ఆగస్టు 25: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం డల్లాపల్లిలో 26 పంచాయతీల ప్రజాప్రతినిధులు, సచివాయ ఉద్యోగులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో ఆదివారం ఎంపీడీవో కె.సాయినవీన్ వినూత్నంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. మండలంలోని ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులుతో సరదాగా గడపాలన్న లక్ష్యంతో ఎంపీడీవో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఒక్కతాటిపై నడుచుకుంటే పంచాయతీలు, గ్రామాలను ఎంతో అభివృద్ధి చేయవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మధ్యాహ్నం విందు అనంతరం ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉత్సాహంగా తాడాట, కుర్చీలు తదితర ఆటలను ఆడుకుంటూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గరుడలో పీఎం జన్‌మన్ గ్రామసభ



గరుడ గ్రామంలో పీఎం జన్‌మన్ గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు, ఆగస్టు 25: పీవీటీజీ గ్రామాల్లో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిర్దేశించిన జన్‌మన్ పథకం అమలుకు ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఇందుకోసం సుమారు ఏడు కిలోమీటర్ల మేర కొండ ఎక్కి వాగులు దాటుకుంటూ సిబ్బంది వెళ్లారు. అనంతరం పథకానికి నిర్దేశించిన కార్యాచరణ ప్రజలకు వివరించారు. స్థానికులు కోరుకున్నట్టు పక్కా ఇళ్లు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయలు కల్పించేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లీల ప్రసాద్, సచివాలయ కార్యదర్శి నాగమణి, సర్వే అసిస్టెంట్ సింహాచలం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పావని, వెల్ఫేర్ అసిస్టెంట్ చిట్టిబాబు, హెల్త్ అసిస్టెంట్ చిట్టిబాబు, సర్పంచ్ చంద్రరావు, ఎంపీటీసీ సభ్యురాలు సత్యవేణి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆస్పత్రి ఉద్యోగుల జీతాల సమస్యకు పరిష్కారం

▸ స్టాఫ్‌నర్స్ ఆత్మహత్యాయత్నం ఘటనతో అధికారుల్లో కదలిక

పాడేరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఆరు నెలల జీతాల బకాయి సమస్యకు పరిష్కారం లభించింది. ఆరు నెలలుగా జీతాలు అందకపోవడంతో పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖాలాలు లేవు. ఇదిలా ఉండగా స్థానిక ఆస్పత్రిలోని మీరా భాను అనే స్టాఫ్‌నర్స్ ఆరు నెలలుగా జీతాలు అందక ఆవేదన చెంది శుక్రవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆస్పత్రి సిబ్బందికి ఆరు నెలలు వేతనాలు అందని వైనం తీవ్ర చర్చనీయాంశమైంది. దీనికి స్పందించిన ఐటీడీఏ పీవో అభిషేక్, వైద్యారోగ్య శాఖాధికారులు ఖజానా అధికారులతో చర్చించారు. దీంతో ఆరు నెలల జీతాలకు ఐదు నెలల జీతాలు తక్షణమే చెల్లించేందుకు చర్యలు చేపట్టారు. ఇదే విషయాన్ని జిల్లా ఖజానాధికారి ప్రసాద్ బాబు ధ్రువీకరించారు. ఎట్టకేలకు తమ జీతాల సమస్య పరిష్కారం కావడంతో ఆస్పత్రి సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అదనపు అంబులెన్స్‌లు

▸ పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

కొయ్యూరు, ఆగస్టు 25: న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సీఎస్సార్ నిధులతో పీహెచ్‌సీలకు అదనంగా ఏడు అంబులెన్సులు ఇచ్చేందుకు అంగీకరించిందని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ వెల్లడించారు. ఎన్‌పీసీఐను పది అంబులెన్స్‌లు అడగగా ఏడు ఇచ్చేందుకు అంగీకరించినట్టు చెప్పారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని పీహెచ్‌సీలలో కొన్నింటికి రెండేసి అంబులెన్స్‌లు అవసరమని గుర్తించామన్నారు. ఇందులో భాగంగా దారకొండ పీహెచ్‌సీకి అంబులెన్స్‌కు రూ.4 లక్షలు యూబీఐ ఇవ్వగా, మిగిలిన రూ.10 లక్షలు ఐటీడీఏ నుంచి కేటాయించి సమకూర్చినట్టు తెలిపారు. రాజేంద్రపాలెం పీహెచ్‌సీతో పాటు మరో ఆరు పీహెచ్‌సీలకు త్వరలో అంబులెన్స్‌లు సమకూర్చుతామని పీవో చెప్పారు.

కైలాసపట్నం బాధితులకు నిత్యావసర సరకులు

చింతపల్లి, ఆగస్టు 25: కైలాసపట్నం కలుషిత ఆహార బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేసినట్టు తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. మండలానికి చెందిన 16 మందికి ఆదివారం నిత్యావసర సరకుల కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత ఆహారం తీసుకుని మరణించిన ఇద్దరు విద్యార్థుల కుటుంబాలతో పాటు అస్వస్థతకు గురైన మరో 14 విద్యార్థుల కుటుంబాలకు బియ్యం, పప్పు, మందులు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో దొండ నాగరాజు పాల్గొన్నారు.

సీలేరులో ఆర్టీసీ పార్శిల్ సర్వీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

సీలేరు, ఆగస్టు 25: గూడెంకొత్తవీధి మండలం సీలేరులో ఆర్టీసీ పార్శిల్ సర్వీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఏపీఎస్ఆర్టీసీ దూర ప్రాంతాలకు లగేజీలు, పార్శిల్ తరలించడానికి ప్రవేశపెట్టిన పార్శిల్ సర్వీస్ ఏజెన్సీ సీలేరులో లేకపోవడంతో ఈ ప్రాంతీయులు విశాఖపట్నం నుంచి సీలేరుకు బుక్ చేయాలంటే భద్రాచలం ఎంఆర్ కట్ చేయాల్సి వస్తోందని, దీనివల్ల అధికంగా ఎంఆర్ చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. అత్యవసరంగా ఏమైనా మందులు, ఇతర సామగ్రి ఆర్టీసీ పార్శిల్ సర్వీస్‌లో బుక్ చేయడానికి సీలేరు ప్రాంత వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని, పీటీడీ అధికారులు స్పందించి సీలేరులో ఆర్టీసీ పార్శిల్ ఏజెన్సీని ఏర్పాటుచేసి ఈ ప్రాంత వినియోగదారులకు ఆర్టీసీ పార్శిల్ సేవలను అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 25: హిందూ ధర్మాన్ని ప్రజలు కాపాడుకోవాలని అరుణానంద స్వామీజీ సూచించారు. ఆదివారం మండలంలోని సంకాడ పంచాయతీ గోవాడ, కుమ్మరపల్లి గ్రామంలో ర్యాలీ చేస్తూ ఆదివాసీల గృహాలను సందర్శించి దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆదివాసీ అర్చకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఆదివాసీ హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. ప్రజలకు హిందూ ధర్మం విశిష్టతను తెలియజేయాలన్నారు. అనంతరం అర్చకులకు పూజా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో దానదర్మ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు డీవీడీ ప్రసాద్, రట్నాల సూర్య, న్యాయవాది కంచర్ల రాజా, ఆదివాసీ అర్చక సంఘం అధ్యక్షులు కొర్ర బలరాం, నాయకులు కంకిపాటి గిరిబాబు, జర్త రాజబాబు, వెంకట రమణ, చిన్నబ్బాయి, గణపతి, వంతల రామారావు, టీడీపీ నాయకుడు కొర్ర బలరామ్ పాల్గొన్నారు.

యూట్యూబర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా సాధురామ్

ముంచంగిపుట్టు, ఆగస్టు 25: యూట్యూబర్స్ కమిటీ మండల ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. పర్తాపుట్టు గ్రామ సమీపంలో నిర్వహించిన సమావేశంలో యూనియన్ మండల అధ్యక్షుడిగా కె.సాదురామ్, ఉపాధ్యక్షుడిగా కె.బాబులాల్, కోశాధికారిగా బి.హర్ష, సలహాదారులుగా జి.అనిల్, బి.రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. మరో పది మంది సభ్యులుగా నియమితులయ్యారు. వ్యక్తిగత చానల్స్, రీల్స్ ఇతర వీడియోలను ఎలా పోస్టు చేయాలని, యూట్యూబు ద్వారా ఎలా డబ్బులు సంపాదించాలనే అంశాలను సీనియర్లు వివరించారు.

సమస్యల పరిష్కారానికి న్యాయ పోరాటం

పాడేరు రూరల్, ఆగస్టు 25: గిరిజన గ్రామాల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే వరకు న్యాయ పోరాటం చేస్తామని జన్ జీవన్ సంఘ సంస్థ అధ్యక్షుడు కె.అప్పాజీ తెలిపారు. కించూరు పంచాయతీ కేంద్రంలో సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జేజేఎం పథకం ద్వారా గ్రామంలో నెలకొల్పిన కుళాయిలు నాణ్యత లేని కారణంగా ఆరు నెలల్లోనే మరమ్మతులకు గురయ్యాయని, పంచాయతీ భవనం లేదని, పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలని గ్రామస్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు పి.మహేష్‌బాబు, కార్యదర్శి జి.సురేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.